సూచనలు, సలహాలు ఇస్తూ..

వికారాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలను తనిఖీ చేసిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 10 : వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్తు మరమ్మతులతోపాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫైల్స్, రికార్డు గదిని పరిశీలించారు. పహణీల స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, ఇతర సామగ్రిని తొలగించవలసిందిగా తహసీల్దార్‌కు సూచించారు. కార్యాలయంలో అవసరాల మేరకు ఫ్యాన్లు సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల ఉపాధి నిమిత్తం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంప్‌ను పరిశీలించి కావలసిన సౌకర్యాలను సమకూర్చుకోవాలని డీఆర్డీవో శ్రీనివాస్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆకస్మిక తనిఖీల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర తదితరులున్నారు.

వికారాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో నిర్వహించే సదరం క్యాంపులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బంట్వారం : వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, సర్కారు దవాఖాన, రేషన్ దుకాణం, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇస్తూ, వసతి గృహాల్లోని పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్కారు దవాఖాన, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏమైనా మరమ్మతులుంటే వెంటనే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా కేజీబీవీలో వంటగది, స్టోర్ రూమ్, టాయిలెట్‌లను పరిశీలించారు. విద్యార్థుల కోరిక మేరకు క్రీడా సామగ్రిని అందజేస్తానని చెప్పారు. దవాఖానలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు గదిని, రికార్డుల స్కానింగ్ విధానాన్ని పరిశీలించారు. రోగులకు మంచి ఆరోగ్య సేవలందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవో నాగరాజ్, డా.మాధురి ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

మర్పల్లి : గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం వేయించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మర్పల్లిలోని వసతి గృహం, పట్లూరు ప్రభుత్వ దవాఖానను సందర్శించి పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేస్తూ, కార్యాలయాల్లో ఏమైనా మరమ్మతులుంటే వెంటనే చేయిస్తామన్నారు. పట్లూరు దవాఖానను సందర్శించి, ప్రసవాల వివరాలు, మౌలిక సదుపాయాలు, నీటి సమస్య, తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులను అందించేలా నిల్వ ఉంచుకోవాలన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న మహిళలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీవో లక్ష్మీకాంత్, ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి నర్సింగ్‌రావు, డా.మానస ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

ధారూరు : అసుపత్రుల్లో గర్భవతులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ధారూరు మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మందులను పరిశీలించారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరీక్షలు నిర్వహించాలన్నారు. వారికి కావాల్సిన ఐరన్, క్యాల్షియం, విటమిన్ మందులను అందిస్తూ.. వాటిని తప్పనిసరిగా వాడేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ మాధవీలతకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఫ్యాన్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

సిద్దులూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

రోగులకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

వికారాబాద్, ఏప్రిల్ 10 : వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం వికారాబాద్ మండల పరిధి సిద్దులూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై వైద్య ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

రవీంద్రభారతి : నాలుగు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో విజయం సాధించి.. ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఇస్తూ తీర్పు వెలువరించిన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అనేకమంది ఉద్యమకారులపై కేసులు పెట్టారని.. తక్షణమే ఆయా కేసులు ఎత్తివేయాలని మాదిగ దండోరా ఉద్యమకారుల వేదిక(ఎండీయూవీ)తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎండీయూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ మాదిగ, చైర్మన్ డా.రుద్రవరం లింగస్వామి మాదిగ మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యోగం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బాధితులకు న్యాయం చేయాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

వికారాబాద్, ఏప్రిల్ 10 : సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని, పోలీస్ అధికారులు కేసుల్లో కన్వెక్షన్ శాతాన్ని పెంచాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ముఖ్యమైన కేసుల పురోగతి, విచారణ స్థితి, న్యాయపరమైన అంశాలు, నేరాల నివారణ చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, న్యాయస్థానాల్లో సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా కేసుల్లో కన్వెక్షన్ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కేసును ప్రాధాన్యతతో పరిశీలించి, చార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయాలని చెప్పారు. సాంకేతిక ఆధారాలను సమకూర్చడం, ఫోరెన్సిక్ సహాయాన్ని వినియోగించడం, ప్రత్యక్ష సాక్షులను సమర్థవంతంగా న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాల కేసులను త్వరితగతిన ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లాలో దొంగతనాలు, ఇతర నేరాలు జరుగకుండా నిరోధించేందుకు సీసీ టీవీల ఏర్పాటు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో పరిగి, వికారాబాద్, తాండూరు డీఎస్పీలు, సీఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 10 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్, సీఈవోలు, ఏపీఎంలు, సీసీ, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్‌లకు రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 15 నుంచి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని, వరి కొనుగోళ్లపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వరి కొనుగోలుకు ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవాలని, మిల్లులకు తేమ లేకుండ నాణ్యమైన వరి ధాన్యాన్ని తరలించేలా రైతులు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 11 కేంద్రాలు సన్నాలు , 117 దొడ్డు రకాలకు సంబంధించి ఉంటాయన్నారు. సుమారు 90వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి, 10వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వరి వస్తుందన్నారు. ఏప్రిల్ చివరి వారం వరకు వరి ధాన్యం వచ్చే సూచనలున్నందున ముందస్తుగానే సెంటర్లు ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఐకేపీ సెంటర్లకు మొదటి ప్రాధాన్యత

ఐకేపీ సెంటర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీలో ధరలు, తేమ శాతం తదితర వివరాలు ఉండాలన్నారు. కేంద్రం వద్ద క్లీనింగ్ మిషన్, తేమ శాతం కొలిచే పరికరాలు, తాగునీరు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్త, పాత గన్నీ బ్యాగులు వేర్వేరుగా ఉంచాలని తెలిపారు. టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు వారి ఆధార్ కార్డును నమోదు చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయి సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం టోకెన్లు ఇచ్చి సెంటర్‌లకు ధాన్యం వచ్చేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా వరి కొనుగోలు జరగాలని అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, మిగతా బ్యాగులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జంగయ్య

షాబాద్, ఏప్రిల్ 10 : భారతదేశాన్ని ఫాసిస్టుల నుంచి కాపాడుకుందామని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం షాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 11 సంవత్సరాల కాలంలో దేశంలోని ప్రజాస్వామికవాదులపై, ప్రశ్నించే నాయకులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని.. ఇది ఫాసిస్టు విధానాలకు దారితీస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులున్నారు.

రాజ్యాంగ విలువలను పరిరక్షించుకుందాం

చేవెళ్లటౌన్ : దేశాన్ని విభజించి పాలిస్తున్న మోదీ ప్రభుత్వం నుంచి ప్రజాస్వామ్య స్ఫూర్తి, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకుందామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి తెలిపారు. చేవెళ్లలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా వామపక్ష నాయకులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల ఉన్నారు.

చేవెళ్లటౌన్ : నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు


మంటలను ఆర్పుతున్న ఉద్యోగి

వికారాబాద్ కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్

వికారాబాద్, ఏప్రిల్ 10 : వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ జరిగింది. కార్యాలయంలోని స్టోర్ రూమ్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన బ్యాటరీలు, ప్లాస్టిక్ వస్తువులు తదితర సామగ్రి కాలి పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. గమనించిన ఉద్యోగులు నీటిని పోసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి అపాయం జరుగలేదని ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 : నిబంధనలకు విరుద్ధంగా వైద్య చికిత్సలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి ఇబ్రహీంపట్నంలోని మంచాల రోడ్డులోగల విజయలక్ష్మి ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. కొన్ని రోజుల క్రితం ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ మహిళకు విజయలక్ష్మి ఆస్పత్రికి చెందిన వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించారని, ఆపరేషన్ వికటించి ఆ మహిళ తిరిగి ఇటీవల గర్భం దాల్చటంతో మరోసారి ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. పొరపాటు జరిగిందని, తిరిగి ఆపరేషన్ నిర్వహించి న్యాయం చేస్తామని విజయలక్ష్మికి చెప్పిన ఆస్పత్రి వైద్యులు మరోసారి ఆపరేషన్ కోసం డబ్బులు డిమాండ్ చేశారని మహిళా కుటుంబసభ్యులు ఆరోపిస్తూ.. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులను సంప్రదించారు. ఈమేరకు గురువారం ఆస్పత్రిని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య చికిత్సలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఐసీయూని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, అబార్షన్లు, భ్రూణ హత్యలు వంటివి నిబంధనలు పాటించకుండా నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే కేసులు పెట్టి కటకటాల వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. బాధిత మహిళకు సరైన న్యాయం చేసేందుకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో రూ.2 కోట్లకు టోకరా

సిటీబ్యూరో : ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు ఇప్పిస్తామంటూ ఆశ పెట్టి ఆన్‌లైన్‌లో మోసం చేసిన వ్యక్తిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఫిర్యాదుదారుడికి ఇటీవల టీనామిట్టల్ నుంచి పెట్టుబడి సలహా కోసం వాట్సప్ గ్రూపులో చేరమని సలహా ఇచ్చారు. బాధితుడు ట్రేడింగ్ యాప్ ద్వారా రూ.2 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాడు. కొద్దిరోజుల తర్వాత బాధితుడు డిపాజిట్స్ ఉపసంహరించుకోవడానికి ప్రయత్నించగా.. డిపాజిట్‌లో 5 శాతం చెల్లించాలని అడిగారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేరంలో పాలుపంచుకున్న తిలక్‌నగర్‌కు చెందిన పకీర్ శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు.

అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, ఏప్రిల్ 10 : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో వంటమనిషి (కుక్), మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కుక్‌కు 10వ తరగతి వరకు చదువుకొని ఉండాలని, మార్కుల ఆధారంగా ఎంపిక నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీడబ్ల్యూ పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలని, 100 శాతం మార్కులు వెయిటేజ్‌ను బట్టి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ పోస్టులకు 15,600 జీతం ఉంటుందన్నారు. అదేవిధంగా కొడంగల్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో ల్యాబ్, అటెండర్ (యుటిలైజ్ సర్వీస్ డేఅండ్‌నైట్ వాచ్‌మన్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తాండూరు బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం లోపు బయోడేటాతోపాటు అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను రీజినల్ కోఆర్డినేటర్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. వివరాలకు 7382931496ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 10 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్మెంట్) మొదటి సెమిస్టర్, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతోపాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలు

ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈ పోటీలను ఈ నెల 4, 5 తేదీల్లో ఠాగూర్ ఆడిటోరియం, టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న ఓయూ వ్యవస్థాపక దినోత్సవంన ప్రదానం చేయనున్నట్లు అధికారులు వివరించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్.డబ్ల్యూ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 30లోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 7 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు, పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

బేగంపేట్, ఏప్రిల్ 10: కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, టెక్ మహేంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో నిరుద్యోగ యువతకు తగిన ఉచిత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ, ఇంటర్, డిగ్రీ చదివిన యువతకు హెల్త్‌కేర్ రంగం, బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలను తగిన శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించినట్టు వారు తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకున్న యువతకు ప్రధానంగ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ టైపింగ్ తదితర వాటిపై ఉచితంగా శిక్షణ అందిస్తామని, అనంతరం ఉద్యోగం కూడా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతీయువకులు తగిన అర్హత కలిగిన సర్టిఫికెట్లతో సికింద్రాబాద్ ప్యారడైజ్లోని పాత సన్షైన్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 82472 55859, 80198 18841 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

న్యాక్‌లో నేషనల్ సెమినార్

కాచిగూడ, ఏప్రిల్ 10 : ఇండియన్ బిల్డింగ్స్ కాంగ్రెస్(ఐబీసీ) న్యూఢిల్లీ తెలంగాణ రోడ్లు భవనాల శాఖ సహకారంతో శుక్ర, శనివారం(రెండు రోజులపాటు) హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) ప్రాంగణంలో ఇన్నోవేషన్స్ ఇన్ బిల్డింగ్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బిల్డింగ్స్ ప్రతినిధులు తెలిపారు. గురువారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇండియన్ బిల్డింగ్స్ నిర్మాణ రంగానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి నిర్మాణ నాణ్యతను మెరుగుపరచడానికి తక్కువ వ్యయంతో నిర్మించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్‌అండ్‌బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఐఏఎస్ వికాస్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ చిన్మయిదేవ్, చైతన్యరెడ్డి, సూర్యప్రకాశ్, సత్యనారాయణ పాల్గొననున్నట్లు తెలిపారు.

తెగుతున్న బంధాలు.. పోతున్న ప్రాణాలు

చిన్నచిన్న కారణాలతో హత్యలు
కుటుంబీకులనే కడతేరుస్తున్న వైనం
దిగజారుతున్న మానవ సంబంధాలు
వివాహేతర సంబంధాలే కారణం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : తండ్రిని నడిరోడ్డుపై కత్తితో కసితీరా పొడిచి చంపిన ఓ కొడుకు.. అన్నను రోడ్డుపై పరుగెత్తించి పరుగెత్తించి నరికి చంపిన ఓ తమ్ముడు.. కుమారుడిని అతి కిరాతకంగా చితకబాది ప్రాణాలు తీసిన తండ్రి.. ప్రియుడిని పెళ్లి చేసుకోవాలనే వ్యామోహంలో ముగ్గురు పిల్లలను చంపేసిన తల్లి.. ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్న ఈ ఘటనలు ఏవో సినిమాల్లోనో.. కథల్లోనో జరిగినవి కాదు. నిజంగానే జరిగిన అమానుష దారుణాలు. సొంత రక్త సంబంధీకులనే కర్కశంగా అంతమొందించిన నిజాలు. గడిచిన మూడు నెల